క్లుప్తంగా

విజయదుర్గమ్మ ఆలయంలో గోపూజ



విజయదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: కనుమ పండుగ సందర్భంగా మంగళవారం పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయంలో గోపూజ నిర్వహించారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, కార్యదర్శి మాడా రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో తొలుత ఆలయంలో పంచముఖ మరకత లింగేశ్వరస్వామికి, శ్రీచక్ర సహిత విజయదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీకి చెందిన హిందూ ధర్మప్రచార పరిషత్, వీహెచ్‌పీ సభ్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చకులు సుదర్శన వేణుగోపాలచార్యులు గోపూజ నిర్వహించారు. గోపూజ విశిష్టతను గరిమెల్ల వీరరాఘవులు వివరించారు. ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, ఆలయ కమిటీల సభ్యులు గుడిమెట్ల యుగంధర్, వందనపు అప్పలరాజు, యర్రం ఉదయ్‌కుమార్, సత్యవరపు దుర్గకుమార్, చిన్ని జయ, వందనపు బాల త్రిపుర సుందరి, వీహెచ్‌పీ నాయకులు కె.వెంకటేశ్వరరావు, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు ప్రత్యేక పూజలు

టి.నరసాపురం: కనుమ పండుగ సందర్భంగా మంగళవారం టి.నరసాపురం కాశీ విశ్వేశ్వర స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోమాతకు, నందీశ్వరునికి పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తరించారు.

స్కంద షష్ఠి వేడుకలు



విశేష అలంకరణతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

కొయ్యలగూడెం: స్కంద షష్ఠి (కుమార షష్ఠి) సందర్భంగా పలు ఆలయాల్లోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుమ రోజున స్కంద షష్ఠి నిర్వహించుకోవడం సంప్రదాయమని, ముక్కోటి దేవతలకు ఏకకాలంలో సుబ్రహ్మణ్యేశ్వరుడు దర్శనమిస్తాడని అర్చకులు శేషాచార్యులు తెలిపారు.

కానుకగా బుల్లెట్



బయ్యనగూడెంలో కోడిపందేల విజేతకు బుల్లెట్‌ను బహుకరిస్తున్న నిర్వాహకులు

కొయ్యలగూడెం: సంక్రాంతి కోడిపందేల్లో విజేతగా నిలిచిన వ్యక్తికి బయ్యనగూడెంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌ని నిర్వాహకులు బహూకరించారు. సరిపల్లి రోడ్‌లో మాదేపల్లి పరమేష్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెంకి చెందిన లొట్టి జగదీష్ అత్యధికంగా 16 కోడిపందేల గెలవడంతో బుల్లెట్ అందజేశారు. రూ.2.80 లక్షల విలువైన బుల్లెట్‌ను గ్రామ ఉపసర్పంచ్ కోరుకొండ లలిత విగ్నేష్, వైఎస్సార్‌సీపీ నాయకుల చేతులమీదుగా విజేతకు అందించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం దాతలు విరాళం అందజేశారు. చింతలపూడికి చెందిన చేబ్రోలు విశ్వనారాయణశాస్త్రి, వారి కుటుంబ సభ్యులు రూ.1,00,001 విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావుకి అందజేశారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రంగవల్లుల పోటీలు



ముగ్గుల పోటీలో విజేతకు బహుమతి అందిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: సంక్రాంతి పండుగ నేపథ్యంలో కనుమ రోజు సందర్భంగా మంగళవారం మండల వ్యాప్తంగా రంగవల్లుల పోటీలు నిర్వహించారు. దిప్పకాయలపాడు పంచాయతీ తంగేళ్లగూడెంలో రంగవల్లులు పోటీలు జరిగాయి. గిరిజన మహిళలు ఆకర్షణీయమైన రంగులతో ముగ్గులను తీర్చిదిద్దుతూ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సందేశాత్మకమైన రంగవల్లులను తీర్చిదిద్దిన మహిళలకు ప్రోత్సాహక బహుమతులతో పాటు రూ.5 వేల నగదు బహుమతి అందజేశారు. పీఏసీఎస్ అధ్యక్షురాలు గొడ్డటి రాణి సౌజన్యంతో ఈ పోటీలు జరిగాయి. పూనం కన్నయ్య, వలసం ఆనంద్, వాసం దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా కోడిపందేలు

జంగారెడ్డిగూడెం: సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు జోరుగా సాగాయి. కోడిపందేల కోసం వివిధ ప్రాంతాల నుంచి పందెంరాయుళ్లతో అన్ని లాడ్జీల్లోని రూమ్‌లు నిండిపోయాయి. పట్టణ పరిధిలోని సుబ్బంపేట రోడ్డులో రెండు ప్రాంతాల్లోను, మండలంలోని శ్రీనివాసపురం, వేగవరం, తాడువాయి, పేరంపేట, పంగిడిగూడెం, లక్కవరం, కేతవరం, గుర్వాయిగూడెం, కొంగువారిగూడెం, గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ప్రజలు పందేల బరుల వద్ద పందేలను వీక్షించేందుకు ప్రత్యేకంగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు పందేలను ఆసక్తిగా తిలకించారు. కుటుంబ సభ్యులు, మహిళలతోపాటు వచ్చి పందేలను వీక్షించారు. శ్రీనివాసపురంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి ఆధ్వర్యంలో కోడిపందేలు నిర్వహించగా, రామానుజపురంలో ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీల కోఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి కుటుంబసభ్యులతో పందేలను వీక్షించారు. గుర్వాయిగూడెంలో సర్పంచ్ గుబ్బల సత్యవాణి, ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి ఆధ్వర్యంలో కోడిపందేలు నిర్వహించారు.

కోడిపందేలు తిలకించిన ఎంపీ శ్రీధర్

లింగపాలెం: లింగపాలెం మండలంలో పండుగ మూడురోజులు సంప్రదాయబద్ధంగా కోడిపందేలు నిర్వహించారు. ములగలంపాడు, శింగగూడెం, అయ్యపరాజుగూడెం, లింగపాలెం గ్రామాల్లోని పామాయిల్, మామిడితోటల్లో నిర్వహించిన కోడిపందేలకు ఈ జిల్లాతోపాటు కృష్ణా, ఖమ్మం జిల్లాల నుంచి భారీగా ప్రజలు, పందెగాళ్లు తరలివచ్చారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ సోమవారం శింగగూడెం, ములగలంపాడు గ్రామాల్లో జరిగిన కోడిపందేలను తిలకించారు. అంతేకాకుండా కర్ణాటక, చెన్నై నుంచి పందేలను తిలకించేందుకు వచ్చారు. పందెం బరుల వద్ద పలావు సెంటర్లు ఏర్పాటు చేశారు. పందేలు జరిగిన గ్రామాల్లో రోడ్లన్ని కార్లు, బైక్‌లతో సందడి వాతావరణం నెలకొంది. ఎంపీ వెంట ములగలంపాడు సర్పంచ్ ఇనుగంటి రాజేష్ బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కోటగిరి చిట్టియ్య, కోటగిరి హరీష్, కోటగిరి ధీరాజ్ కృష్ణ, కోటగిరి రామకుమార్ తదితరులు ఉన్నారు.

98 మందిపై కేసుల నమోదు

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగ మూడు రోజులు కోడి పందేలు యథేచ్ఛగా సాగాయి. ఈ క్రమంలో కోడిపందేల స్థావరాలపై దాడిచేసి పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ద్వారకాతిరుమల, తిమ్మాపురం, తిరుమలంపాలెం గుణ్ణంపల్లి, ఎం.నాగులపల్లి, రాళ్లకుంట, దొరసానిపాడు, జి.కొత్తపల్లి, వెంకటకృష్ణాపురం, రామన్నగూడెం తదితర గ్రామాల్లో కోడి పందేలు భారీగా జరిగాయి. పలు కోడి పందేల స్థావరాలపై దాడులు చేసి, 98 మందిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్సై సుధీర్ చెప్పారు. పందెంరాయుళ్ల వద్ద నుంచి కొంత నగదు, కోడి పుంజులు, కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ముమ్మరంగా కోడిపందేలు

చింతలపూడి: నియోజకవర్గంలో సంక్రాంతి మూడు రోజులు కోడిపందేలు ముమ్మరంగా నిర్వహించారు. కోడి పందేలపై నిషేధం ఉన్నప్పటికీ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కోడి పందేలను యథేచ్ఛగా వేశారు. జిల్లాలోని చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండ కృష్ణా, ఖమ్మం, వరంగల్, తూర్పుగోదావరి, గుంటూరు, కర్నూలు జిల్లాలనుంచి కూడా పందెంరాయుళ్లు వాహనాలలో తరలివచ్చి పందేలలో పాల్గొన్నారు. దూర ప్రాంతాలనుంచి వచ్చే పందెంరాయుళ్ల కోసం టెంట్లు వేసి అన్ని ఏర్పాట్లు చేశారు. మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. ముఖ్యంగా రాత్రిళ్లు ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేసి మరీ పందేలను కొనసాగించారు.

టి.నరసాపురం: మండలంలోని అప్పలరాజుగూడెం, బండివారిగూడెం, బందంచర్ల, తిరుమలదేవిపేట, టి.నరసాపురాలలో కోడిపందేలను నిర్వహించారు. భోగి రోజున ప్రారంభమైన ఈ పందేలు, సంక్రాంతి, కనుమ రోజు సాయంత్రం వరకు కొనసాగాయి.



జంగారెడ్డిగూడెం: కోడిపందేలు నిర్వహిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం: కోడిపందేలు వీక్షిస్తున్న బీవీఆర్ చౌదరి కుటుంబ సభ్యులు



లింగపాలెం: శింగగూడెంలో కోడి పందేలను తిలకిస్తున్న ఏలూరు ఎంపీ శ్రీధర్



టి.నరసాపురం: అప్పలరాజుగూడెంలో కోడిపందేలు నిర్వహిస్తున్న దృశ్యం

ఊరూవాడా సంక్రాంతి సందడి

బుట్టాయగూడెం: సంక్రాంతి పల్లెల్లో సందడి చేసింది. ఊరూ వాడా వేడుకగా మారింది. తెలుగింటి ఆడపడుచులు, చిన్నారులు, పెద్దలు సంక్రాంతిని సంబరంగా జరుపుకున్నారు. భోగి మొదలుకుని సంక్రాంతి, కనుమ వరకూ సంబరాలు అంబరాన్నంటాయి. కొత్త అల్లుళ్ళు, ఆడపడుచులు, బంధువులతో ఇళ్లు కళకళలాడాయి. మహిళలు పిండి వంటలు చేసే పనిలో నిమగ్నమవ్వగా యువతులు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే యువకులు వాలీబాల్, కబడ్డీ పోటీల్లో పాల్గొని ఉత్సాహంగా ఆడారు. సంక్రాంతి పండుగ మూడు రోజులు కోడి పందేలు యథేచ్ఛగా నిర్వహించారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం, రెడ్డిగణపవరంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీలు ముగిశాయి. మూడు రోజుల పాటు ఉత్సాహంగా గ్రామాల్లో వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.



దుద్దుకూరులో కోడిపందేలను తిలకిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, తదితరులు



ద్వారకాతిరుమల: రాళ్లకుంట బరిలో తలపడుతున్న కోడి పుంజులు



ద్వారకాతిరుమల: దొరసానిపాడులో ఢీకొంటున్న కోడి పుంజులు



జంగారెడ్డిగూడెం: ప్రత్యేక గ్యాలరీలో కోడిపందేలు వీక్షిస్తున్న దృశ్యం



చింతలపూడి: ఢీకొంటున్న కోడి పుంజులు

భక్తుల పరవశం

శ్రీవారి రాకకోసం ఏడాది అంతా వేచి ఉన్న భక్తులు.. ఆ స్వామివారి రాకతో పులకించిపోయారు. కనుమ ఉత్సవం కోసం స్వామివారు క్షేత్రాన్ని విడిచి దొరసానిపాడు గ్రామానికి ఏడాదికోసారి వస్తారు. దేవేరులతో సహా స్వామివారు రాజాధిరాజ వాహనంపై ఆశీనులై తిరువీధుల మీదుగా దొరసానిపాడు చేరుకున్నారు. శ్రీవారు, అమ్మవార్లను గ్రామంలోని కనుమ మండపంలోకి ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు పరవశించిపోయారు. ఉత్సవం అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. – ద్వారకాతిరుమల



కనుమ మండపానికి ఉత్సాహంగా తరలివెళుతున్న స్వామి, అమ్మవార్లు



కనుమ ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా గజలక్ష్మి



ఉత్సవంలో ఆకట్టుకున్న శక్తి వేషధారణలు



కేరళ డప్పు వాయిద్యాల సందడి



మేళతాళాలు, మంగళ వాయిద్యాలు ఇలా



కనుమ ఉత్సవంలో సతీ సమేతంగా ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు



కనుమ ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

జంగారెడ్డిగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమాన్ని బుధవారం 3వ సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తెలిపారు. స్థానిక ఎంబీ సోషల్ క్లబ్ ఆవరణలో ఉదయం 9 నుంచి 5 గంటల వరకు ఈ వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి చేతులమీదుగా ప్రారంభిస్తారని తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్య సేవలు పొందాలని కోరారు.

పత్రికా ప్రకటన

[illegible] శ్రీరామ ఫైనాన్స్ లిమిటెడ్, సత్తుపల్లి [illegible] ఖమ్మం జిల్లా, తెలంగాణా రాష్ట్రం [illegible] పశ్చిమగోదావరి జిల్లా (ఏలూరు జిల్లా), చింతలపూడి మండలం [illegible] ... 658.4 చ.గ.ల [illegible] 2775/2012.

[illegible] పశ్చిమగోదావరి జిల్లా (ఏలూరు జిల్లా), చింతలపూడి మండలం, [illegible] సర్వే నెంబరు 183/17 [illegible] 658.4 [illegible] చ.మీ. 548.85 [illegible]

[illegible] శ్రీరామ ఫైనాన్స్ లిమిటెడ్, సత్తుపల్లి [illegible]

సత్తుపల్లి తేది : 16-1-24 — గాడి హరీందర్ రెడ్డి, D.A.E., B.A., B.L. అడ్వకేట్, ఖమ్మం - 507 002.

మదర్ థెరిస్సాను స్ఫూర్తిగా తీసుకోవాలి

బుట్టాయగూడెం: విద్యార్థులకు చదువులతోపాటు సేవా కార్యక్రమాలు అలవర్చుకునేలా ఉపాధ్యాయులు వారిని తీర్చిదిద్దాలని వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెం సమీపంలో నిర్వాసిత గ్రామమైన తల్లవరంలో ఫౌండేషన్ ప్లస్ స్కూల్‌లో స్వర్గీయ మాడే చిన్నరామయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మాడే శ్రీరాములు, కుటుంబ సభ్యులు మదర్ థెరిస్సా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని రాజ్యలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మదర్ థెరిస్సా సేవలపై ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాలన్నారు. మదర్ థెరిస్సాను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.



తల్లవరంలో మదర్ థెరిస్సా విగ్రహాన్ని ఆవిష్కరించిన రాజ్యలక్ష్మి, తదితరులు

కార్యక్రమంలో జెడ్పీటీసీ, సర్పంచ్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉపాధ్యాయులు, జేఏసీ నాయకులు, మాడే వారి కుటుంబ సభ్యులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరిస్తున్నాయి. దీనిలో భాగంగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు కపిలేశ్వరపురానికి చెందిన నేమాని నాగలక్ష్మి భాగవతారిణి శ్రీనివాస కల్యాణం అంశంపై హరికథా కాలక్షేపం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీ సత్యసాయి సేవా సంస్థలకు చెందిన భక్తులు సత్యసాయి నామ సంకీర్తన నిర్వహించారు. రాత్రి 8.15 గంటలకు నగరానికి చెందిన నాట్యాచారిణి ఏ.పార్వతి రామచంద్రన్ శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం విశేషంగా ఆకట్టుకున్నాయి.

సంక్షేమ పథకాలే మళ్లీ గెలిపిస్తాయి

కామవరపుకోట: నవరత్నాల పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో మరలా వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం ఆయన మండలంలో పర్యటించి కార్యకర్తలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టినప్పటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. దీనితో రాష్ట్ర ప్రజలు మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైపే మొగ్గు చూపుతున్నారని అన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో వైఎస్సార్‌సీపీ 175 సీట్లు గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు, కామవరపుకోట ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు, అన్నపనేని రాజశేఖర్, ఉప్పలపాటి శ్రీనివాసరావు, నల్లూరి ప్రభాకర్ రావు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.



కామవరపుకోటలో ఎంపీ కోటగిరి శ్రీధర్‌తో వైఎస్సార్‌సీపీ నేతలు